సాక్షి మహబూబాబాద్

శనివారం । 29 । ఏప్రిల్ । 2023



దేవాదుల టార్గెట్ జూన్

దేవాదుల కాల్వల నిర్మాణ పనులను పూర్తి చేసి జూన్ కల్లా నీళ్లు పారేలా సిద్ధం చేయాలని మంత్రి ఎర్రబెల్లి ఆదేశించారు.

- IIలో



నాణ్యమైన వైద్యం అందించాలి

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని డోర్నకల్ శాసనసభ్యుడు డీఎస్ రెడ్యానాయక్ అన్నారు.

- IIIలో

గరిష్టం/కనిష్టం
38.9⁰/25.3⁰

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రతతో పాటు ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

వినియోగదారుల హక్కులను కాపాడాలి



మహబూబాబాద్: వినియోగదారుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత కమిటీపై ఉందని అదనపు కలెక్టర్ డేవిడ్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో వినియోగదారుల ఫోరం సమావేశం అదనపు కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా డేవిడ్ మాట్లాడుతూ.. సభ్యుల సూచన మేరకు ఐకేపీ సెంటర్లలో దళారీ వ్యవస్థకు తావు లేకుండా తూనికలు, కొలతలపై దృష్టి పెడుతామన్నారు. మండలస్థాయిలో వినియోగదారుల హక్కులపై అవగాహన సదస్సులు నిర్వహించేందుకు సహకారం అందిస్తామన్నారు. ఫోరం సభ్యులు కూడా వినియోగదారులు నష్టపోకుండా సహకరించాలన్నారు. కమిటీ సమావేశంలో వినియోగదారుల కమిటీ చైర్మన్ సుధాకర్, డీసీఎస్‌ఓ నర్సింగరావు సివిల్ సప్లయీస్ డీఎం కృష్ణవేణి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఇంటర్, డిగ్రీ ప్రవేశ పరీక్ష

మహబూబాబాద్ అర్బన్: మహాత్మా జ్యోతిబాపూలే గురుకులాల్లో ఇంటర్, డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఈ నెల 30న ఉదయం 10నుంచి 12.30 గంటల వరకు ప్రవేశపరీక్ష ఉంటుందని గురుకులాల జిల్లా కోఆర్డినేటర్ జి.అనిత్ శుక్రవారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని గురుకుల కళాశాల సెంటర్‌లో 220 మంది, అనంతారం మోడల్‌స్కూల్ సెంటర్‌లో 240, ఫాతిమా హైస్కూల్‌లో 240, ప్రభుత్వ బాలికల పాఠశాలలో 240, ప్రభుత్వ బాలుర పాఠశాలలో 240 మంది, ఎంజేపీ గుమ్ముడూరు కళాశాల, పాఠశాల (పత్తిపాక) సెంటర్‌లో 165 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. పరీక్ష కేంద్రానికి విద్యార్థులు గంటముందే చేరుకోవాలన్నారు.

సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలి



తొర్రూరు: ప్రతి ఒక్కరూ సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని వాసవిక్లబ్ జిల్లా ఇన్‌చార్జ్ ప్రొద్దుటూరి గౌరీశంకర్ అన్నారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలో వాసవిక్లబ్, వనితా క్లబ్‌ల ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. గోశాలలో దాణా వితరణ, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా గౌరీశంకర్ మాట్లాడుతూ.. వాసవీక్లబ్ చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో వాసవి, వనితా క్లబ్‌ల అధ్యక్షులు వజినెపల్లి అనిల్‌కుమార్, దీప, ప్రతినిధులు చీదర నీలిమ, మహేష్, మచ్చ సోమయ్య, బిజ్జాల అనిల్‌కుమార్, ఇమ్మడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళి అమ్మవారికి గంధోత్సవం



హన్మకొండ కల్చరల్: వరంగల్ భద్రకాళి దేవాలయంలో శ్రీభద్రకాళిభద్రేశ్వరుల కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో రోజు శుక్రవారం అమ్మవారికి గంధోత్సవం నిర్వహించారు. ఉదయం నిత్యాహ్నికం, చతుస్థానార్చన నిర్వహించారు. ప్రధానార్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో ముఖ్యార్చకులు పార్నంది నర్సింహమూర్తి, అర్చకులు చెప్పల ప్రభాకరశర్మ తదితర వేదపండితులు అమ్మవారి స్నపనమూర్తికి గంధాన్ని పట్టించి అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమాలకు వరంగల్ కమ్మ సేవాసంఘం ఉభయదాతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో కమ్మ సంఘం అధ్యక్షులు మందటి కోటేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి గంగవరపు రామకృష్ణప్రసాద్ తదితర నాయకులు పాల్గొన్నారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని సాలభంజిక వాహనంపై ప్రతిష్ఠించి ఊరేగించారు. సాలభంజికసేవలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈఓ శేషుభారతి, సిబ్బంది పర్యవేక్షించారు.

బీఫార్మసీ (నాన్ సీబీసీఎస్) ఫస్టియర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ బీఫార్మసీ (నాన్ సీబీసీఎస్) ఫస్టియర్ (సప్లిమెంటరీ) పరీక్షలు మే 4వతేదీనుంచి నిర్వహించనున్నట్లు అధికారులు పి.మల్లారెడ్డి, డాక్టర్ ఎ.రాధిక తెలిపారు. మే 4, 8, 11, 16, 18, 20 తేదీల్లో పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతాయని పేర్కొన్నారు.

జేపీఎస్‌ల సమ్మెబాట..

జూనియర్ పంచాయతీ కార్యదర్శుల స్థానంలో ఇతరుల కేటాయింపునకు కసరత్తు

- ఆ శాఖలోని సిబ్బందికి అదనపు బాధ్యతలు
- జాబితా సిద్ధం చేసిన అధికారులు



నెల్లికుదురు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జేపీఎస్‌ల సమ్మె

మహబూబాబాద్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులు(జేపీఎస్) సమ్మె బాట పట్టడంతో వారి స్థానంలో ఆ శాఖలోని ఇతర సిబ్బందికి అదనపు బాధ్యతలు అప్పగించేందుకు కసరత్తు చేపట్టారు. కాగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎంపీడీఓల ఆధ్వర్యంలో జాబితాను సిద్ధం చేసినట్లు సమాచారం. సీనియర్ పంచాయతీ కార్యదర్శులకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూ జాబితా తయారు చేసినట్లు తెలిసింది.

మూడేళ్ల కాలపరిమితితో..

2019 ఏప్రిల్ 11న జూనియర్ పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వం మూడు సంవత్సరాల ప్రొబేషనరీ పీరియడ్‌తో ఉద్యోగాల్లోకి తీసుకున్న విషయం విదితమే. ఈ క్రమంలో మరో ఏడాది కాలపరిమితి పెంచుతూ సీఎం కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా జీఓను విడుదల చేశారు. అయితే పెంచిన గడువు కూడా ఈ నెల 11వ తేదీతో ముగింది. ఈక్రమంలో జిల్లాలోని 381మంది జేపీఎస్‌లు తమ సమస్యలు పరిష్కరించాలని వినతులు అందజేశారు. సంబంధితశాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఉన్నతాధికారులకు వినతి అందజేశారు. ఈనెల 16నుంచి 27వ తేదీ వరకు నిరసన కార్యక్రమాలు చేపట్టారు.

ప్రభుత్వం స్పందించకపోవడంతో సమ్మెబాట..

నిరసన కార్యక్రమాలతో ప్రభుత్వం స్పందించకపోవడంతో జేపీఎస్‌లు శుక్రవారం నుంచి సమ్మెబాట పట్టారు. విధులు బహిష్కరించి ఎంపీడీఓ కార్యాలయాల ఎదుట ఆందోళనకు దిగారు. గతంలోనే రెండుసార్లు అన్యాయం జరిగిందని, ఉద్యోగ భద్రత లేదని, వేతనాలు సక్రమంగా రావడం లేదని, సమస్యలు పరిష్కరించేంత వరకు ఆందోళనలు కొనసాగిస్తామని జేపీఎస్‌లు హెచ్చరించారు.

సిబ్బంది జాబితా సిద్ధం..

జేపీఎస్‌లు సమ్మె బాట పట్టడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు వారి స్థానంలో ఇతర సిబ్బందికి బాధ్యతలు అప్పగించేందుకు అధికారులు జాబితా సిద్ధం చేసినట్లు సమాచారం. ఈమేరకు సీనియర్ పంచాయతీ కార్యదర్శులకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిసింది. జాబితాలో పంచాయతీ కార్యదర్శులు, సూపరింటెండెట్లు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, బిల్ కలెక్టర్లు, రికార్డు అసిస్టెంట్లు, టైపిస్టులతో ఎంపీడీఓలు జాబితాను సిద్ధం చేసినట్లు విశ్వసనీయ సమాచారం. సర్టిఫికెట్లు, రైతుబంధు, రైతుబీమా, పింఛన్లు ఇచ్చేందుకు ప్రత్యామ్నాయ సిబ్బంది ఆధార్ కార్డులతో డిజిటల్ సంతకాలు చేయించి టోకెన్ ఇచ్చే విధంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా ప్రభుత్వ ఆదేశాలు, ఉన్నతాధికారుల పని తీరుపై జేపీఎస్‌లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోకపోగా తాము సమ్మెకు దిగిన వెంటనే ప్రత్యామ్నాయ సిబ్బందిని ఏర్పాటు చేయడంపై జేపీఎస్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రేపు కానిస్టేబుల్ అభ్యర్థుల రాత పరీక్ష



ఫిజికల్ ఈవెంట్స్‌లో పాల్గొన్న అభ్యర్థి (ఫైల్)



సీపీ ఏవీ రంగనాథ్

- పరీక్ష కేంద్రాలు 16.. అభ్యర్థులు 12,040 మంది
- నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు
- వరంగల్ సీపీ ఏవీ రంగనాథ్

వరంగల్ క్రైం: స్టయిఫండరీ క్యాండెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుళ్ల రాత పరీక్ష ఈ నెల 30న జరగనుందని, ఈ మేరకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. పరీక్ష నిర్వహణకు తీసుకుంటున్న చర్యలు, అభ్యర్థులు పాటించాల్సిన జాగ్రత్తలను శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. రాత పరీక్ష కోసం వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో 16 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. ఉమ్మడి జిల్లానుంచి పరీక్షకు 12,040 మంది అర్హత సాధించారని వివరించారు.

అభ్యర్థులకు సూచనలు...

- నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదు.
- హాల్ టికెట్‌ను పరీక్ష కేంద్రం, హాల్‌లో చూపిస్తేనే లోపలికి అనుమతి ఉంటుంది.
- అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు, సెల్‌ఫోన్లు, బ్యాగులను తీసుకురావద్దు.
- పోలీస్ నియామకబోర్డు జారీ చేసిన హాల్‌టికెట్, బ్లాక్, బ్లూపెన్, ఆధార్, డ్రైవింగ్, ఓటర్ గుర్తింపు కార్డులు మాత్రమే తీసుకురావాలి.
- అభ్యర్థుల గుర్తింపును పరీక్ష కేంద్రాల వద్ద పూర్తిగా పరిశీలించిన తరువాతే లోపలికి అనుమతిస్తారు.
- పరీక్ష ప్రారంభమైన తరువాత అభ్యర్థులను హాల్‌లోకి అనుమతించరు. లోపల ఉన్న వారిని పరీక్ష పూర్తయ్యేవరకు బయటకు పంపించరు.
- అభ్యర్థులు గంట ముందుగా తమకు కేటాయించిన కేంద్రాలకు చేరుకోవాలి.
- పరీక్ష రాసే ముందు అభ్యర్థులు ఓఎంఆర్ షీట్‌ను పూర్తిగా చదువుకోవాలి.
- ఓఎంఆర్‌షీట్‌పై అనవసరపు గుర్తులు, మతపరమైన గుర్తులు, ఏమైనా రాస్తే ఆ ఓఎంఆర్‌షీట్‌ను పరిగణనలోకి తీసుకోరు.
- అభ్యర్థులు ఏమైనా అనైతిక చర్యలకు పాల్పడినా.. వారి ఓఎంఆర్‌షీట్‌ను పరిగణనలోకి తీసుకోరు.
- ఒక అభ్యర్థికి బదులు మరో అభ్యర్థి పరీక్ష రాస్తే వారిపై చట్టపరంగా చర్యలు ఉంటాయి.
- అభ్యర్థుల ఫొటోలు, వేలిముద్రలు క్షుణ్ణంగా పరిశీలిస్తారు.
- మెహందీ, సిరా వంటి వాటిని చేతులకు, పాదాలకు పెట్టుకోకూడదు.
- ప్రశ్నపత్రం తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో ఉంటుంది.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

మహబూబాబాద్: మానుకోట మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని, మిషన్ భగీరథ పనులు కూడా త్వరగా పూర్తి చేయించాలని అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో తాగునీటి సమస్య, ఇతర విషయాలపై అదనపు కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మిషన్ భగీరథ ట్యాంక్‌ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలన్నారు. సకాలంలో పనులు పూర్తి చేసేందుకు కూలీల సంఖ్య పెంచాలన్నారు.

నేడు జిల్లాలో వైఎస్ షర్మిల పర్యటన

- అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు పరామర్శ

సాక్షి, మహబూబాబాద్: వైఎస్సార్ టీపీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల శనివారం జిల్లాలో పర్యటించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను కలిసి పరామర్శించనున్నారు. కాగా ఉదయం 9 గంటలకు హైదరాబాద్‌లోని లోటస్ పాండ్ నివాసం నుంచి షర్మిల బయలుదేరుతారు. ఆలేరు, కొలనుపాక మీదుగా జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం ఆలింపూర్, గంగాపూర్ గ్రామాల్లో పర్యటిస్తారు. అక్కడి నుంచి జనగామ, తిరుమలగిరి, తొర్రూరు, మరిపెడ మీదుగా సాయంత్రం 4 గంటలకు జిల్లాలోని డోర్నకల్ నియోజకవర్గంలోని కురవి మండలానికి చేరుకుంటారు. 4:30 గంటలకు అయ్యగారిపల్లి గ్రామంలో ఇటీవల కురిసిన అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను కలిసి పరామర్శిస్తారు. కాగా జిల్లాలోని వైఎస్సార్ టీపీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్ అభిమానులు సకాలంలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఇదిలా ఉండగా ఇటీవల నిర్వహించిన ప్రజాప్రస్థానం యాత్రలో భాగంగా మహబూబాబాద్‌కు విచ్చేసిన షర్మిల, స్థానిక ఎమ్మెల్యేల మధ్య మాటల యుద్ధం జరిగింది. అది కాస్త ముదిరి షర్మిలను అరెస్టు చేశారు. కాగా జిల్లాలో మళ్లీ షర్మిల పర్యటిస్తున్న నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు.

ఎవరికి వారే..

ఉమ్మడి జిల్లా కాంగ్రెస్‌లో రోజుకో కొట్లాట

- ముదిరి పాకాన పడుతున్న కుమ్ములాటలు
- వివాదంగా బహిష్కరణల ప్రకటనలు
- వరంగల్ పశ్చిమ నుంచి జనగామకు పాకిన పంచాయితీ
- టీపీసీసీ వరకు వెళ్లిన ఫిర్యాదులు.. చర్యలు లేక నేతల విచ్చలవిడి



జనగామ: భట్టి ప్రెస్‌మీట్ టెంటు వద్ద ఘర్షణ పడుతున్న పొన్నాల, కొమ్మూరి వర్గీయులు

సాక్షిప్రతినిధి, వరంగల్: కాంగ్రెస్ పార్టీలో ముఖ్యనాయకులు, నేతల తీరు మారడం లేదు. 'ఎవరికీ వారే.. యమునా తీరే'లా ఉంది సీనియర్ల పరిస్థితి. టీపీసీసీ, క్రమశిక్షణ సంఘం దృష్టికి వెళ్లినా మార్పులేకపోగా.. రోజురోజుకూ వివాదాలు పెరుగుతున్నాయి. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ కాంగ్రెస్‌లో కుమ్ములాటలు ముదిరి పాకాన పడుతున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో ఆ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువై గొడవలకు దారి తీస్తోంది. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో మొదలైన పరస్పర బహిష్కరణల ప్రకటనల పర్వం ఇప్పుడు జనగామ నియోజకవర్గం వరకు పాకింది. సుమారు తొమ్మిదేళ్లుగా అధికారానికి దూరంగా ఉంటున్నా... పార్టీ కార్యక్రమాలపై సరిగా దృష్టి సారించని కొందరు.. అధిష్టానం సూచనలు, నిర్ణయాలను పెడచెవిన పెడుతున్నారు. వారిని కట్టడి చేయడంలో అధిష్టానం సైతం ఉదాసీనంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో ఆ పార్టీ నేతల మధ్య ఉన్న అంతర్గత విబేధాలు తారస్థాయికి చేరుతున్నాయి.

కొనసాగుతున్న బహిష్కరణల పర్వం..

వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డిల నడుమ వైరం మొదలైంది. చినికి చినికి గాలివానగా మారిన రాజకీయవైరం టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ వరకు వెళ్లింది. చివరకు ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసిన నాయిని రాజేందర్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డిని పార్టీనుంచి తొలగిస్తూ అధిష్టానానికి లేఖ రాశారు. ఆ మరుసటి రోజే పోటీగా మీడియా సమావేశం ఏర్పాటు చేసిన రాఘవరెడ్డి తనను బహిష్కరించే అధికారం నాయినికి లేదని కౌంటర్ ఇచ్చారు. టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి పాదయాత్ర సమయంలో ఈ వివాదం చోటుచేసుకోగా ఇటీవల సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పీపుల్స్‌మార్చ్ సందర్భంగా పునరావృతం కాలేదు. దీంతో పరిస్థితి చక్కబడిందని భావిస్తున్న సమయంలో జనగామ కాంగ్రెస్‌లో కయ్యం మొదలైంది. పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య వర్సెస్ మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాపరెడ్డిల వర్గాల మధ్య విబేధాలు తారస్థాయికి చేరాయి. కొమ్మూరి ప్రతాపరెడ్డిని పార్టీనుంచి సస్పెండ్ చేస్తున్నట్లు గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి జనగామ డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పేరిట ప్రకటన చేశారు. దీని వెనుక పొన్నాల లక్ష్మయ్య హస్తం ఉందని, అసలు డీసీసీ వర్కింగ్ కమిటీ లేనప్పుడు సస్పెండ్ చేసే అధికారం ఎక్కడిదంటున్న కొమ్మూరి వర్గీయులు మరో ప్రెస్‌మీట్‌లో కౌంటర్ ఇచ్చారు. ఆ తర్వాత పొన్నాల లక్ష్మయ్య, కొమ్మూరి ప్రతాపరెడ్డిలు పోటాపోటీగా మీడియా సమావేశాల్లో ఘాటైన వ్యాఖ్యలు చేసుకున్నారు. శుక్రవారం జనగామ జిల్లా తరిగొప్పుల మండలం అబ్దుల్‌నాగారంలో భట్టి విక్రమార్క పాదయాత్రకు స్వాగతం పలికే సందర్భంగా ఇద్దరు నాయకులు, వారి అనుచరుల మధ్య ఘర్షణ చోటుచేసుకోగా పోలీసులు చెదరగొట్టారు.

కాంగ్రెస్‌లో హీటెక్కిన పాలిటిక్స్..

- ములుగు నియోజకవర్గం మినహా మెజార్టీ అసెంబ్లీ నియోజకవర్గాల్లో గ్రూపు విబేధాలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. వర్ధన్నపేటలో నమిండ్ల శ్రీనివాస్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తుండగా పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ ఎంపీగా పోటీ చేసి ఓడిపోయిన దొమ్మాటి సాంబయ్య, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్యలు దృష్టి పెట్టినట్లు ఆ పార్టీ వర్గాల్లో ప్రచారం ఉంది.
- స్టేషన్‌ఘన్‌పూర్ విషయానికి వస్తే గతంలో అక్కడ పోటీ చేసిన సింగాపురం ఇందిర టికెట్ ఆశిస్తుండగా, దొమ్మాటి సాంబయ్య, సిరిసిల్ల రాజయ్యల పేర్లు కూడా వినిపిస్తున్నాయి.
- పరకాల, భూపాలపల్లిలనుంచి ఇనుగాల వెంకట్రాంరెడ్డి, గండ్ర సత్యనారాయణరావుల పేర్లుండగా. రెండో టికెట్ కోసం పరకాలపై కొండా సురేఖ దంపతులు చేస్తున్న ప్రయత్నాలు ఆగలేదన్న చర్చ ఉంది. దీంతో పరకాలలో ఇనుగాల వెంకట్రాంరెడ్డి, కొండా సురేఖ దంపతుల మధ్య గ్రూపుల వైరం సాగుతూనే ఉంది.
- మహబూబాబాద్ నుంచి మురళీనాయక్, బెల్లయ్యనాయక్, కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్‌లు, డోర్నకల్ నుంచి రాంచంద్రనాయక్, నెహ్రూనాయక్‌లు పోటాపోటీగా అధిష్టానంపై ఒత్తిడి చేస్తున్నట్లు ప్రచారం.
- పాలకుర్తి నుంచి గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయి ఇప్పుడక్కడ ససేమిరా అంటున్న జంగా రాఘవరెడ్డి.. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం టికెట్ దాదాపుగా నాయిని రాజేందర్‌రెడ్డి ఖరారైనట్లేనన్న ప్రచారం జరుగుతున్నా తాను సైతం పోటీలో ఉంటానంటున్నారు.
- వరంగల్ తూర్పు, నర్సంపేటల నుంచి కొండా సురేఖ, దొంతి మాధవరెడ్డిల పేర్లుండగా, పాలకుర్తిలో ఎవరన్నది ఇంకా తేలడం లేదు.

రైతులపై ప్రభుత్వ నిర్లక్ష్యం

- కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్



మాట్లాడుతున్న మాజీమంత్రి బలరాంనాయక్

కేసముద్రం: అకాలవర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాం నాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో నష్టపోయిన రైతులను సీఎం కేసీఆర్ పట్టించుకోకుండా, పక్కనున్న మహారాష్ట్రకు వెళ్లి మన డబ్బులను ఖర్చుపెడుతున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో తాను అమ్ముడుబోయానంటూ స్థానిక ఎమ్మెల్యే శంకర్‌నాయక్, ఎంపీ కవిత తప్పుడు ఆరోపణలు చేశారని, నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని బలరాంనాయక్ అన్నారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్ ఇష్టారీతిన తప్పుడు వ్యాఖ్యలు చేయడం సరికాదని, ఇప్పటికైనా తన భాష మార్చుకోవాలని హితవు పలికారు. అన్నం పెట్టిన కాంగ్రెస్ పార్టీపై రెడ్యానాయక్, కవిత విమర్శలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు నూనావత్ రాధ, కాంగ్రెస్ కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు తోట వెంకన్న, మండల అధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ అల్లం నాగేశ్వర్‌రావు, ఎంపీటీసీలు బాలునాయక్, కృష్ణమూర్తి, నాయకులు గుజ్జునూరి బాబురావు, కూరెల్లి సతీష్, వెంకటేష్, మాసాడి శ్రీనివాస్, రాంబాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు



రైతు వేదికలో మాట్లాడుతున్న ఉమారెడ్డి

గూడూరు: రైతులు ఆధునిక పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ వ్యవసాయ సంచాలకులు ఉమారెడ్డి అన్నారు. మండలంలోని బొద్దుగొండ రైతు వేదికలో శుక్రవారం మాల్యాల కృషి విజ్ఞాన కేంద్రం, ఆర్ఏడబ్ల్యూఈపీ విద్యార్థుల ఆధ్వర్యంలో రైతు సదస్సు నిర్వహించారు. ముందుగా విద్యార్థులు వ్యవసాయంలో ఆధునిక పద్ధతుల ప్రదర్శన ద్వారా బిందు సేద్యం, సమగ్ర వ్యవసాయం, వరిలో వెదజల్లే పద్ధతి, పుట్టగొడుగుల పెంపకం, వివిధ పంటల్లో కొత్త రకాల ప్రదర్శన గురించి రైతులకు వివరించారు. అనంతరం ఉమారెడ్డి మాట్లాడుతూ.. రైతులు తప్పకుండా విద్యార్థులు ప్రదర్శించిన వాటిని పాటించాలని కోరారు. సమగ్ర వ్యవసాయ విధానాలైన పశువులు, కోళ్ల పెంపకం ద్వారా రెట్టింపు ఆదాయం పొందాలని సూచించారు. కార్యక్రమంలో కేవీకే మల్యాల ప్రోగ్రాం కో ఆర్డినేటర్ మాలతి, జిల్లా వ్యవసాయ అధికారి ఛత్రునాయక్, డీహెచ్ఎస్ఓ సూర్యనారాయణ, ఇన్‌చార్జ్ ఏడీ వెంకన్న, గూడూరు ఏఓ అల్లె రాకేష్, ఏఈఓలు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ తోట సందర్శన

కురవి: సీరోలు మండలం కొత్తూరు(సీ) గ్రామంలో డాక్టర్ ఇంద్రసేనారెడ్డికి చెందిన ఆయిల్‌పామ్ తోటను తెలంగాణ మండల అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ ఉమారెడ్డి, మల్యాల కేవీకే శాస్త్రవేత్తలు శుక్రవారం సందర్శించారు. ఎరువుల యాజమాన్యం, చీడపీడలు, పంట దిగుబడి, గెలల పరిమాణంపై రైతును ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతును ఉమారెడ్డి అభినందించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి సూర్యనారాయణ, కేవీకే సమన్వయకర్త డాక్టర్ మాలతి, శాస్త్రవేత్త డాక్టర్ రాంబాబు పాల్గొన్నారు.

జిల్లా జడ్జిని కలిసిన అదనపు కలెక్టర్



జిల్లా జడ్జికి మొక్క అందజేస్తున్న అదనపు కలెక్టర్

మహబూబాబాద్ రూరల్: జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖరప్రసాద్‌ను అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్, ట్రైనీ కలెక్టర్ పింకేశ్‌కుమార్ శుక్రవారం జిల్లా కోర్టు ఆవరణలో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కోర్టు ప్రభుత్వ న్యాయవాది కొంపెల్లి వెంకటయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దేశబోయిన వెంకటస్వామి, న్యాయవాదులు పాల్గొన్నారు.

బయ్యారంలో పర్యటించిన పీసీసీఎఫ్



నివాస గృహాన్ని పారంభిస్తున్న లోకేష్ జైస్వాల్

బయ్యారం: మండలంలో శుక్రవారం అటవీశాఖ ప్యారల్ ఛీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, కంపా సీఈఓ లోకేష్ జైస్వాల్ పర్యటించారు. బయ్యారంలో రూ.28లక్షల నిర్మించిన అటవీశాఖ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం నామాలపాడు సమీపంలో కంపా నిధులతో నిర్మించిన చెక్‌డ్యామ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా అటవీశాఖాధికారులతో మాట్లాడుతూ.. అటవీ సంపద పరిరక్షణతో పాటు వన్యప్రాణులను కాపాడేందుకు ప్రాముఖ్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సీసీఎఫ్ భీమానాయక్, డీఎఫ్ఓ రవికిరణ్, ఎఫ్‌డీఓ కృష్ణమాచారి తదితరులు ఉన్నారు.

బీట్ ఆఫీసర్ నివాసగృహం ప్రారంభం

కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నివాస గృహాన్ని శుక్రవారం అటవీశాఖ ప్రిన్సిపల్ ఛీఫ్ కన్జర్వేటర్ లోకేష్ జైస్వాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అడవులను సంరక్షించడం, పర్యావరణాన్ని పరిరక్షించడం కోసం అటవీశాఖ సిబ్బంది తగిన శ్రద్ధ చూపాలని ఆదేశించారు. కార్యక్రమంలో భద్రాద్రి జోన్ సీసీఎఫ్ భీమానాయక్, డీఎఫ్ఓ రవికిరణ్, డీఎఫ్ఓ కృష్ణమాచారి, గ్రాయత్రి గ్రానైట్స్ అధినేత వద్దిరాజు కిషన్, ఎఫ్ఆర్ఓ మంగీలాల్, సర్పంచ్ దార్ల రాంమూర్తి, కేసముద్రం సొసొటీ చైర్మన్ దికొండ వెంకన్న, సెక్షన్ ఆఫీసర్ శివకుమార్, బీట్ ఆఫీసర్లు శ్రీధర్, యాకూబ్, జనార్దన్ పాల్గొన్నారు.

నేడు నవోదయ ప్రవేశ పరీక్ష

మహబూబాబాద్ అర్బన్: నేడు మానుకోట జిల్లాలో నవోదయ ఆరో తరగతి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు వరంగల్ మామునూర్ నవోదయ స్కూల్ ప్రిన్సిపాల్ పూర్ణిమ శుక్రవారం తెలిపారు. జిల్లాలో 7 సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. గూడూరు ప్రభుత్వ పాఠశాల సెంటర్‌లో 255 మంది, మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఫాతిమా హైస్కూల్ 240 మంది, బాలికల ఉన్నత పాఠశాలలో 240, ప్రభుత్వ బాలుర పాఠశాలలో 186, అనంతారం మోడల్ స్కూల్‌లో 240, మరిపెడ ఆగస్టిన్ హైస్కూల్‌లో 240, మరిపెడ మోడల్ పాఠశాల సెంటర్‌లో 253 మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. ప్రవేశ పరీక్ష ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరుగుతుందని, నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదన్నారు. అదే విధంగా పరీక్ష సెంటర్‌కు గంటముందే చేరుకోవాలని, విద్యార్థులు కోవిడ్ నిబంధనలు పాటించాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో బ్యాంకింగ్, ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ పోటీ పరీక్షలపై ఐదు నెలల శిక్షణకు ఎస్సీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు శాఖ జిల్లా అధికారి సన్యాసయ్య శుక్రవారం తెలిపారు. డిగ్రీ పూర్తి చేసిన జిల్లాకు చెందిన ఎస్సీ అభ్యర్థులు ఆన్‌లైన్‌లో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీఎస్‌స్టడీసర్కిల్.కామ్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 29నుంచి మే 14తేదీ దరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మే 21న ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంలోని స్టడీ సర్కిల్‌లో ప్రవేశ పరీక్ష ఉదయం 11నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉంటుందన్నారు. వివరాలకు 9573904205 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

దగ్గు మందును ప్లాస్టిక్‌ బాటిళ్లలో విక్రయించొద్దని వినతి



ఎంజీఎం: తెలంగాణ వ్యాప్తంగా అమ్ముతున్న సుమారు 70 రకాల దగ్గు మందులను ప్లాస్టిక్‌ పెట్‌ బాటిళ్లలో అమ్మకాలు చేయవద్దని శుక్రవారం వినియోగదారుల మండలి రాష్ట్ర అధ్యక్షులు చక్రపాణి డ్రగ్‌ కంట్రోల్‌ జేడీ రాందన్‌కు వినతిపత్రం అందించారు. మెడికల్‌ షాపుల్లో సరైన స్టోరేజీ, కూలింగ్‌ సౌకర్యాలు లేక, వేడికి ప్లాస్టిక్‌ బాటిళ్ల కరిగి అవశేషాలు దగ్గు మందులో కలవడం వల్ల క్యాన్సర్‌ వంటి హానికరమైన ఊపిరితిత్తుల వ్యాధులు వస్తున్నాయన్నారు. దగ్గు మందులు ప్లాస్టిక్స్‌ బాటిళ్లలో అమ్మకం చేయరాదని వినియోగదారుల ప్రతినిధులు, ఆరోగ్య నిపుణులు పూర్తి ఆధారాలతో దేశవ్యాప్తంగా అనేకమార్లు విన్నవించినా.. ఔషధ నియంత్రణాధికారులు పట్టించుకోవడం లేదని జాయింట్‌ డైరెక్టర్‌ రాందన్‌కు విన్నవించినట్లు తెలిపారు. 100 ఎంఎల్‌ ఉంటున్న దగ్గు మందు బాటిల్స్‌ లేబుల్స్‌పై బాటిల్‌లోని 100 ఎంఎల్‌ ఇన్‌గ్రిడెంట్స్‌ వివరాలు ఉంచడం లేదని, 30 శాతం వివరాలు మాత్రమే ముద్రించి, మిగతా 70 శాతం మందులో ఏం కలుపుతున్నారో వాటి వివరాలు తెలపడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై జాయింట్‌ డైరెక్టర్‌ రాందన్‌ స్పందించి రాష్ట్ర మందుల ఉత్పత్తిదారులంతా బాటిల్స్‌పై పూర్తి వివరాలు ముద్రించేలా ఆదేశాలు ఇవ్వనున్నట్లు హామీ ఇచ్చారని చక్రపాణి తెలిపారు.

తాగొచ్చి గొడవకు దిగారు



భట్టి విక్రమార్కకు పొన్నాల వర్గం ముందుగా స్వాగతం పలికింది. ఆ తర్వాతే నేను వెళ్లాను. యాత్ర విజయవంతం చేసేందుకు నా ప్రయత్నం చేస్తున్నా. యాత్రలో 80 శాతం పార్టీ శ్రేణులు నావైపు ఉంటే.. కేవలం 20 శాతం మాత్రమే పొన్నాల వైపు ఉన్నారు. ఇందులో కొందరు మద్యం సేవించి, మాపై ఇష్టం వచ్చినట్లు దుర్భాషలాడుతూ, నెట్టేశారు. జనగామ నియోజకవర్గంలో ఓటు హక్కు వచ్చిన యువకుల నుంచి వృద్ధుల వరకు పొన్నాలను వ్యతిరేకిస్తున్నారు. ఇక్కడ జరిగిన గొడవపై అధిష్టానం చూసుకుంటుంది.

– కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

గొడవలు చేసే వారిని పట్టించుకోం

పార్టీలో అనవసరంగా గొడవలు చేసే పనికి రాని వాళ్ల గురించి పట్టించుకోం. భట్టికి స్వాగతం పలికే విషయంలో అనవసరంగా గొడవ జరిగేలా వ్యవహరించిందెవరో అందరికీ తెలుసు. ఇక్కడ జరిగింది ప్రతి ఒక్కరూ గమనించారు.

– పొన్నాల లక్ష్మయ్య, పీసీసీ మాజీ అధ్యక్షుడు

పొన్నాల వర్సెస్‌ కొమ్మూరి

- 'భట్టి' యాత్రలో ఉద్రిక్తత
- ఇరువర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట
- కొమ్మూరి రాకుండా అడ్డుకున్న పొన్నాల వర్గం
- చెదరగొట్టిన పోలీసులు
- ఉద్రిక్తతల మధ్య సాగుతున్న యాత్ర



భట్టి ప్రెస్‌మీట్‌ టెంట్‌ వద్ద కొమ్మూరిని అడ్డుకుంటున్న పొన్నాల వర్గీయులు

జనగామ: సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పాదయాత్ర ఉద్రిక్తతకు దారి తీసింది. భట్టికి స్వాగతం పలికే విషయంలో పొన్నాల, కొమ్మూరి వర్గాలు పోటీ పడడం తోపులాటకు దారి తీసింది. భట్టి విక్రమార్క పాదయాత్ర శుక్రవారం హనుమకొండ జిల్లా నుంచి జనగామ జిల్లా తరిగొప్పుల మండలం అబ్దుల్‌నాగారం చేరుకుంది. అప్పటికే టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య, మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ మెంబర్‌ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి వర్గీయులు అక్కడికి చేరుకున్నారు. ఈవిషయాన్ని గమనించిన సీఐ నాగబాబు పొన్నాల, కొమ్మూరి వర్గాలను దూరంగా ఉండేలా నచ్చజెప్పారు. ఎవరికి వారే డప్పు చప్పుళ్లు.. బాణా సంచా పేలుస్తూ.. సంబరాలు చేసుకున్నారు. పోటాపోటీగా నినాదాలు చేసుకున్నారు. భట్టి యాత్ర అబ్దుల్‌ నాగారం బార్డర్‌ చేరుకోవడంతో పొన్నాల, ఆయన అనుచరవర్గం ముందుగా వెళ్లి.. ఘన స్వాగతం పలికారు. ఐదు నిమిషాల వ్యవధిలో కొమ్మూరి సైతం భట్టి వద్దకు వెళ్లి.. శాలువాతో సత్కరించే సమయంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. చేతిలో ఉన్న జెండా కర్రలతో కొట్టుకునేందుకు సిద్ధమయ్యారు. సీఐ నాగబాబు, ఎస్‌ఐ నరేశ్‌, సిబ్బంది రంగప్రవేశం చేసి.. ఇరువర్గాలను నెట్టేశారు.

పోటాపోటీ నినాదాలు

అబ్దుల్‌నాగారం శివారులో పొన్నాల, కొమ్మూరి వర్గాల మధ్య గొడవ సద్దుమణిగిన తర్వాత యాత్ర సాఫీగా ముందుకు సాగింది. భట్టికి ఇరువైపులా కొమ్మూరి, మరో వైపు పొన్నాల నడుచుకుంటూ వెళ్లారు. ఈసమయంలో పొన్నాల వర్గానికి చెందిన పలువురు కొమ్మూరిని నెట్టే ప్రయత్నం చేశారు. భోజన విరామ సమయంలో ప్రత్యేక టెంట్‌ వద్ద ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో పాల్గొనేందుకు కొమ్మూరి రాగా.. పొన్నాల వర్గీయులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య మరోసారి గొడవ జరగ్గా పోలీసుల జోక్యంతో వివాదం సద్దుమణిగింది. కొమ్మూరి బయటనే ఉండాల్సి వచ్చింది. 'డౌన్‌ డౌన్‌' అంటూ ఇరు వర్గాలు నినాదాలు చేశాయి. లంచ్‌ బ్రేక్‌ తర్వాత అబ్దుల్‌నాగారం శివారు నుంచి సాయంత్రం 6.35 గంటలకు భట్టి యాత్ర ప్రారంభమైంది. నర్సాపూర్‌, నర్మెటలో ఇరు వర్గాలు గొడవకు దిగే అవకాశం ఉందని అడుగడుగునా పోలీసులు మోహరించారు.

కొమ్మూరికి భట్టి ఫోన్‌

ఇదే సమయంలో భట్టి విక్రమార్క కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి స్వయంగా ఫోన్‌ చేసి పిలిపించుకున్నారు. యాత్రలో అందరం కలిసి ముందుకు వెళదామని, సమస్యలుంటే అధిష్టానం చూసుకుంటుందని నచ్చజెప్పారు. దీంతో యాత్ర ముందుకు సాగింది.

పలకరిస్తూ.. సమస్యలు తెలుసుకుంటూ..



చిల్పూరు: ప్రజలతో మాట్లాడుతున్న సీఎల్పీ నేత

- జనగామ జిల్లాలో సాగిన సీఎల్పీ నేత 'భట్టి' పాదయాత్ర

చిల్పూరు/తరిగొప్పుల/నర్మెట: సీఎల్పీనేత భట్టి విక్రమార్క చేపట్టిన 'పీపుల్స్‌ మార్చ్‌' పాదయాత్ర శుక్రవారం జనగామ జిల్లాలోని చిల్పూరు, తరిగొప్పుల, నర్మెట మండలాల్లో సాగింది. టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, పార్టీ శ్రేణులు, అభిమానులు స్వాగతం పలుకగా.. ప్రజలను పలకరిస్తూ.. సమస్యలు తెలుసుకుంటూ.. కేంద్ర, రాష్ట్ర పాలకుల విధానాలను ఎండగడుతూ.. 'భట్టి' ముందుకు సాగారు. ఉదయం 10 గంటలకు చిల్పూరు మండలం లింగంపల్లి శివారు కొమ్ముగుట్ట నుంచి ప్రారంభమైన పాదయాత్ర.. తరిగొప్పుల మండలం అబ్దుల్‌నాగారం, నర్సాపూర్‌, మరియాపురం మీదుగా నర్మెట వరకు కొనసాగింది. మండల కేంద్రంలోని ఓ హోటల్‌లో పొన్నాలతో కలిసి భట్టి విక్రమార్క టీ తాగారు. ఈసందర్భంగా పొన్నాల గోబ్యాక్‌ అంటూ కొమ్మూరి వర్గం వారు నినాదాలు చేయడంతో.. అక్కడ ప్రసంగించకుండానే పోలీసు బందోబస్తు మధ్య ముందుకు సాగారు. రాత్రి బస నర్మెటలోనే చేశారు. పాదయాత్రకు ముందు లింగంపల్లి సమ్మక్క–సారలమ్మ ఆర్చి వద్ద భట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఇదిలా ఉండగా తమను సెర్ప్‌ ఉద్యోగులుగా గుర్తించేలా ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలంటూ వీఓఏలు తరిగొప్పులలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేశారు. పాదయాత్రలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గం ఇన్‌చార్జ్‌ సింగపురం ఇందిర, నాయకులు దొమ్మాటి సాంబయ్య, అమృతరావు, గడ్డమీది సురేశ్‌, ముత్తిరెడ్డి అమరేందర్‌రెడ్డి, మాదిరెడ్డి యశ్వంతరెడ్డి, చిలువేరు సంపత్‌, వగలబోయిన యాదగిరి, బ్యాంగి శివకుమార్‌ తదితరులు పాల్గొన్నారు.



తరిగొప్పుల : పాదయాత్రలో భట్టి విక్రమార్క

దేవాదుల టార్గెట్‌ జూన్‌



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

- అప్పటికల్లా కాలువల పనులు పూర్తి కావాలి
- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌ రావు సమీక్ష
- పాల్గొన్న అధికారులు, ఇంజనీర్లు

సాక్షి ప్రతినిధి, వరంగల్‌: దేవాదుల కాలువల నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేసి జూన్‌ కల్లా ఆ కాలువల్లో నీళ్ల పారేలా సిద్ధం చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్‌, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌ రావు సంబంధిత ఇంజనీర్లను ఆదేశించారు. ఈమేరకు మంత్రి హైదరాబాద్‌లోని మంత్రుల నివాసంలో సంబంధిత అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. కాలువల పనుల్లోని సమస్యలు తెలుసుకుని వాటిని వెంటవెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. పరిష్కారం కాని సమస్యలుంటే తన దృష్టికి తేవాలని చెప్పారు. భూ పరిహారం రైతులకు ఇప్పించడంలో ఆలస్యాన్ని క్షమించేది లేదని, అలాంటి పెండింగ్‌ పనులు ఏమైనా ప్రభుత్వం వద్ద ఉంటే తమ దృష్టికి తెచ్చి వెంటనే ఆ నిధులను రైతులకు ఇప్పించాలని మంత్రి సూచించారు.

ప్రధాన కాల్వల పని కానియ్యండి

నష్కల్‌ రిజర్వాయర్‌ నుంచి పాలకుర్తి రిజర్వాయర్‌ వరకు నిర్మిస్తున్న మెయిన్‌ కెనాల్‌ పనుల్ని అత్యంత వేగంగా పూర్తి చేయాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌ రావు అధికారులను ఆదేశించారు. ఇదే కెనాల్‌లో 8 ఎకరాల మేర రైతులకు భూపరిహారానికి సంబంధించి టోకెన్‌ ఇచ్చి ఉన్నారని అందుకు సంబంధించిన డబ్బులను వెంటనే రైతులకు ఇప్పించాలని అధికారులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందిస్తూ వివరాలు తెలియజేస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి డబ్బులు రైతులకు అందేలా చేస్తామని హామీ ఇచ్చారు. 7 ఎల్‌ డిస్ట్రిబ్యూటరీ కెనాల్‌కు సంబంధించి జీ తమ్మడపల్లి నుంచి గంట్లకుంట వరకు నిర్మించాల్సిన కాలువలపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి అన్నారు. రాయపర్తి మండలం కొలన్‌పల్లి, తిరుమలాయపల్లి తదితర గ్రామాల మీదుగా గంట్లకుంట వరకు వచ్చే కాలువల పనుల్ని వెంటనే పూర్తి చేయాలని మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. సమీక్షలో వరంగల్‌ చీఫ్‌ ఇంజనీర్‌ రమేశ్‌బాబు, ఎస్‌ఈ సుధీర్‌, ఈఈలు సీతారాం, ప్రవీణ్‌, డీఈఈ రవీందర్‌ తదితరులు పాల్గొన్నారు.

అకాడమీ ఆఫ్‌ సైన్సెస్‌ ఫెల్లోస్‌ అవార్డుల అందజేత



అవార్డులు అందుకుంటున్న కేయూ ఆచార్యులు, అధ్యాపకులు

కేయూ క్యాంపస్‌: కాకతీయ యూనివర్సిటీ నుంచి పలువురు ఆచార్యులు తెలంగాణ అకాడమీ ఆఫ్‌ సైన్సెస్‌ ఫెల్లోస్‌గాను, అసోసియేట్‌ ఫెల్లోస్‌గా శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డులు అందుకున్నారు. అకాడమీ ఆఫ్‌ సైన్సెస్‌ ఫెల్లోస్‌గా కేయూ జియాలజీ విభాగాధిపతి ఆచార్య ఆర్‌.మల్లికార్జున్‌రెడ్డి, ఫార్మసీ విభాగం ఆచార్యులు వై.నర్సింహారెడ్డి, జువాలజీ విభాగాధిపతి ఆచార్య జి.షమిత, కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బాటనీ విభాగం అసోసియేట్‌ ప్రొఫెసర్‌ ఓంకార్‌ హైదరాబాద్‌లో ఇండియన్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ కెమికల్‌ టెక్నాలజీలో జరిగిన అవార్డుల ప్రధాన కార్యక్రమంలో జేఎన్‌టీయూ వీసీ ఆచార్య కట్టా నర్సింహారెడ్డి చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. అలాగే అకాడమీ ఆఫ్‌ సైన్సెస్‌ అసోసియేట్‌ ఫెల్లోస్‌గా కంప్యూటర్‌ సైన్స్‌ విభాగం అసిస్టెంట్‌ ఆచార్యులు డాక్టర్‌ బి.రమ, మ్యాథ్స్‌ విభాగం కాంట్రాక్ట్‌ అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ టి.నాగయ్య, జియాలజీ విభాగం పార్ట్‌టైం అధ్యాపకుడు డాక్టర్‌ సాయికృష్ణ, బయోటెక్నాలజీ విభాగం పరిశోధకుడు డాక్టర్‌ జె.ఫణికాంత్‌ అవార్డులు అందుకున్నారు. వీరిని కేయూ వీసీ తాటికొండ రమేశ్‌, రిజిస్ట్రార్‌ ఆచార్య టి.శ్రీనివాస్‌రావు అభినందించారు.

పిల్లలకు పెళ్లి కావట్లేదని మహిళ ఆత్మహత్య



విమల(ఫైల్‌)

ఎల్కతుర్తి: ఎదిగిన పిల్లలకు పెళ్లి కావట్లేదని, ఆర్థిక ఇబ్బందులతో భీమదేవరపల్లి మండలం మాణిక్యాపూర్‌కు చెందిన పుల్లి విమల(52) శుక్రవారం ఆత్మహత్య చేసుకుంది. విమల 25 ఏళ్లుగా కరీంనగర్‌ జిల్లా హుజూరాబాద్‌లో ఉంటూ మిషన్‌ కుడుతూ తన పిల్లలను పోషిస్తోంది. భర్త కుటుంబాన్ని పట్టించుకోకుండా వ్యవసాయం చేస్తూ.. మాణిక్యాపూర్‌ నుంచి హుజూరాబాద్‌కు వచ్చి వెళ్తుంటాడు. పెరిగిన పిల్లల పెళ్లిళ్ల కోసం విమల చాలా ప్రయత్నాలు చేసింది. తన పిల్లలకు పెళ్లిళ్లు కావట్లేదని, మరోవైపు ఆర్థిక ఇబ్బందులతో ఆమె మనస్తాపానికి గురైంది. జీవితంపై విరక్తి చెంది గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుమారుడు రాకేశ్‌కుమార్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు తెలిపారు.

ఉరేసుకుని యువకుడు..



రమేశ్‌(ఫైల్‌)

దుగ్గొండి: మండలంలోని నాచినపల్లి గ్రామానికి చెందిన చెల్ల సమ్మయ్య–సమ్మక్క దంపతుల కుమారుడు రమేశ్‌ (30) హైదరాబాద్‌లో గురువారం సాయంత్రం అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్య చేసుకున్నాడు. రమేశ్‌ కొన్నేళ్లుగా హైదరాబాద్‌లో ఉంటూ ఓ చిట్‌ఫండ్‌ కంపెనీలో పని చేస్తున్నాడు. ఈక్రమంలో ఏం జరిగిందో తెలియదు కానీ గురువారం సాయంత్రం తను నివాసం ఉంటున్న గదిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన గది యజమాని రమేశ్‌ కుటుంబీకులకు సమాచారం అందించారు. దీంతో వారు హైదరాబాద్‌ వెళ్లారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని శుక్రవారం స్వగ్రామానికి తీసుకొచ్చారు. కాగా.. మృతుడి తండ్రి సమ్మయ్య నెల క్రితం తీవ్ర అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో మృతుడి తల్లి సమ్మక్క, ఇద్దరు సోదరులు బోరున విలపిస్తున్నారు.

కుటుంబ కలహాలతో..



రాకేశ్‌(ఫైల్‌)

చెన్నారావుపేట: కుటుంబ కలహాలతో మండలంలోని అక్కల్‌చెడ గ్రామానికి చెందిన కొత్త రాకేశ్‌ (24) శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. రాకేశ్‌ కూలీ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఐదేళ్ల క్రితం దుగ్గొండి మండలంలోని నాచినపల్లికి చెందిన శ్రీ విద్యతో వివాహం జరిగింది. వీరికి కుమారుడు జన్మించాడు. కొన్ని రోజులుగా దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో శ్రీ విద్య పుట్టింటికి వెళ్లింది. మనస్తాపం చెందిన రాకేశ్‌ ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి కొత్త కొంరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తోట మహేందర్‌ తెలిపారు.

3 నుంచి జిల్లా కోర్టులకు సెలవులు

- విధుల్లో ఇన్‌చార్జ్‌ న్యాయమూర్తులు

వరంగల్‌ లీగల్‌: రాష్ట్ర వ్యాప్తంగా మే 3వ తేదీ నుంచి 31 వరకు జిల్లా కోర్టులకు వేసవి సెలవులు ప్రకటించారు. ఈమేరకు వివిధ కోర్టుల్లో ఇన్‌చార్జ్‌ న్యాయమూర్తులను నియమిస్తూ హైకోర్టు రిజిస్ట్రార్‌ జనరల్‌ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌చార్జ్‌ల విధులు రెండు విడతలుగా ప్రకటించారు. వాటిలో మొదటి 14 రోజులు (మే 3 నుంచి 16) వరకు, రెండో విడత మే 18 నుంచి 31 వరకు కొనసాగనున్నాయి. ఈసెలవుల్లో హనుమకొండ జిల్లాకు ఇన్‌చార్జ్‌ న్యాయమూర్తులుగా మొదటి విడత ఫ్యామిలీ కోర్టు జడ్జి అపర్ణదేవి, రెండో విడతలో మొదటి అదనపు జిల్లా జడ్జి టి.జయలక్ష్మి వ్యవహరిస్తారు. వరంగల్‌ జిల్లా ఇన్‌చార్జ్‌గా మొదటి విడతలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి కోక రాధాదేవి, రెండో విడతలో మొదటి అదనపు జిల్లా జడ్జి ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి మనీషా మెహెరా వ్యవహరించనున్నారు. జనగామ జిల్లాకు మొదటి విడతలో వరంగల్‌ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కోక రాధాదేవి, రెండో విడతలో జనగామ జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి.రవీంద్రశర్మ ఇన్‌చార్జ్‌లుగా బాధ్యతలు నిర్వహిస్తారు. మహబూబాబాద్‌ జిల్లాకు మొదటి విడతలో ఆ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.చంద్రశేఖర ప్రసాద్‌, రెండో విడతలో వరంగల్‌ జిల్లా మొదటి అదనపు జిల్లా జడ్జి మనీషా మహెరా ఇన్‌చార్జ్‌లుగా వ్యహరించనున్నారు. ములుగు జిల్లా కోర్టుకు మొదటి విడతలో ఆజిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.వెంకటపద్మ లలితా శివజ్యోతి, రెండో విడతలో భూపాలపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి నారాయణబాబు ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరిస్తారు. భూపాలపల్లి జిల్లాకు మొదటి విడతలో ములుగు జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.వెంకటపద్మ లలితా శివజ్యోతి, రెండో విడతలో భూపాలపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నారాయణ బాబు ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరించనున్నారు.

గంగా పుష్కరాలకు ప్రత్యేక రైళ్లు

- నేటి నుంచి సికింద్రాబాద్‌ – బనారస్‌ మధ్య సేవలు



కాజీపేట రూరల్‌: కాజీపేట జంక్షన్‌ మీదుగా దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని గంగా పుష్కరాలకు సికింద్రాబాద్‌–బనారస్‌ మధ్య నాలుగు ప్రత్యేక రైళ్లను శనివారం నుంచి నడిపిస్తున్నట్లు శుక్రవారం రాత్రి రైల్వే అధికారులు తెలిపారు. జిల్లా నుంచి గంగ పుష్కరానికి వెళ్లే ప్రయాణికులకు ఈ రైళ్ల సర్వీస్‌లు అందుబాటులో ఉన్నాయి.

ప్రత్యేక రైళ్ల వివరాలు

ఈనెల 29వ తేదీ శనివారం సికింద్రాబాద్‌–బనారస్‌ (07303) ఎక్స్‌ప్రెస్‌ కాజీపేటకు రాత్రి 11:30 గంటలకు చేరుతుంది. బనారస్‌–సికింద్రాబాద్‌ (07304) ఎక్స్‌ప్రెస్‌ మే 1 సోమవారం 10:30 గంటలకు కాజీపేటకు చేరుకుంటుంది. సికింద్రాబాద్‌–బనారస్‌ (07035) ఎక్స్‌ప్రెస్‌ మే 3 బుధవారం 11:40 గంటలకు చేరుకుంటుంది. బనారస్‌–సికింద్రాబాద్‌ (07306) ఎక్స్‌ప్రెస్‌ మే 5 శుక్రవారం కాజీపేటకు 10:35 గంటలకు చేరుకుంటుంది.

కోచ్‌ల సౌకర్యం

ఈఎక్స్‌ప్రెస్‌లకు ప్రయాణికుల సౌకర్యార్థం ఫస్ట్‌ ఏసీ, ఏసీ 2 టైర్‌, ఏసీ 3 టైర్‌, స్లీపర్‌ క్లాస్‌, జనరల్‌ సెకండ్‌ క్లాస్‌ కోచ్‌ల సౌకర్యం కలదు.

హాల్టింగ్‌లు

సికింద్రాబాద్‌–బనారస్‌ మధ్య ఈ రైళ్ల సర్వీస్‌లకు జనగామ, కాజీపేట, పెద్దపల్లి, రామగుండం, బెల్లంపల్లి, సిర్‌పూర్‌ కాగజ్‌నగర్‌, బల్లార్షా, నాగపూర్‌, ఇటార్సీ, పిపారియ, జబల్‌పూర్‌, ఖట్నీ జంక్షన్‌, సట్నా, మాణిక్‌పూర్‌, ప్రయాగ్‌రాజ్‌, చెకి స్టేషన్‌లో అప్‌ అండ్‌ డౌన్‌ హాల్టింగ్‌ కల్పించారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడి దుర్మరణం



గీసుగొండ: విద్యుత్‌ షాక్‌తో వరంగల్‌ జిల్లా రాయపర్తి మండలం పెర్కవేడు గ్రామానికి చెందిన అరూరి చంద్రశేఖర్‌(19) శుక్రవారం మృతి చెందాడు. చంద్రశేఖర్‌ తన పెద్దనాన్న సాంబయ్యతో కలిసి గీసుగొండ మండలం మనుగొండ శివారు రాంపురం బంధువుల ఇంటికి బయల్దేరాడు. ఈక్రమంలో మార్గమధ్యలోని ఎస్సారెస్పీ ఉప కాల్వ వద్ద చంద్రశేఖర్‌ బహిర్భూమికి వెళ్లాడు. పంటల సాగు కోసం కాల్వలో మోటార్లకు బిగించిన విద్యుత్‌ వైర్లు తగిలి యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. ఈ విషయమై సీఐ సట్ల రాజును వివరణ కోరగా.. ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

గ్రామంలో విషాదఛాయలు

చంద్రశేఖర్‌ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబీకులు కన్నీటి పర్యంతమయ్యారు. అందరితో కలిసి ఉండేవాడని గుర్తు చేసుకుంటూ గ్రామస్తులు కన్నీరుమున్నీరయ్యారు.

అడవులను సంరక్షించుకోవాలి

- పీసీసీఎఫ్‌ లోకేశ్‌ జైస్వాల్‌



ఫొటోలు పరిశీలిస్తున్న పీసీసీఎఫ్‌ లోకేశ్‌

ఖానాపురం: అడవులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అటవీ అధికారులపై ఉందని పీసీసీఎఫ్‌ కంపా లోకేశ్‌ జైస్వాల్‌ అన్నారు. ఈమేరకు మండలంలోని పాకాలను శుక్రవారం రాత్రి సందర్శించారు. గతంలో అటవీ విస్తీర్ణం ఎంత ఉంది, ప్రస్తుతం ఎంత ఉందనే విషయాన్ని ఫారెస్ట్‌ అధికారులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఫారెస్ట్‌ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పనుల మ్యాప్‌లను ఏర్పాటు చేయగా.. వాటిని పరిశీలించారు. ఫారెస్ట్‌ అధికారులు వాటి గురించి పీసీసీఎఫ్‌కు వివరించారు. రూట్‌రైనర్‌లు, హరితనిధి ద్వారా ఏర్పాటు చేసిన మొక్కలను తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఫారెస్ట్‌ ప్రాంతాన్ని అన్యాక్రాంతం కాకుండా చూసుకోవాలన్నారు. హరితహారం ద్వారా గతంలో కంటే అటవీ విస్తీర్ణాన్ని పెంచడానికి మరింతగా కృషి చేయాలని సూచించారు. ఆయన వెంట సీఎఫ్‌ భీమానాయక్‌, వరంగల్‌ డీఎఫ్‌ఓ అర్పన, మహబూబాబాద్‌ డీఎఫ్‌ఓ రవికిరణ్‌, మహబూబాబాద్‌ ఎఫ్‌డీఓ చంద్రశేఖర్‌రావు, ఎఫ్‌ఆర్‌ఓ బల్లిడి రమేశ్‌, డీఆర్‌ఓ మోహన్‌, బీట్‌ ఆఫీసర్లు, సెక్షన్‌ ఆఫీసర్లు పాల్గొన్నారు.

రైలు ఢీకొని రైతు మృతి



కాశిబుగ్గ: గుర్తు తెలియని రైలు ఢీకొని గీసుగొండ మండలం శాయంపేటకు చెందిన రైతు అల్లం శౌరెడ్డి(68) శుక్రవారం మృతి చెందాడు. వరంగల్‌ జీఆర్పీ సీఐ నరేశ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. శౌరెడ్డి తన భార్యతో కలిసి వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం పొలం వద్దకు వెళ్తూ చింతలపల్లి, వరంగల్‌ రైల్వే స్టేషన్ల మధ్య శాయంపేట చర్చి సమీపంలో రైలు పట్టాలు దాటుతుండగా అప్‌లైన్‌తో వెళ్తున్న ఓ గుర్తు తెలియని రైలు ప్రమాదవశాత్తు ఢీకొట్టింది. దీంతో రైతు అక్కడికక్కడే మృతి చెందాడు. డిప్యూటీ ఎస్‌ఎస్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించామని సీఐ తెలిపారు.

టెస్టుల్లో శ్రీలంక 'సెంచరీ' విజయం



బౌలర్లు రమేశ్ మెండిస్ (5/64), ప్రభాత్ జయసూర్య (2/88), అసిథా ఫెర్నాండో (3/30) రాణించడంతో... ఐర్లాండ్‌తో గాలెలో జరిగిన రెండో టెస్టులో శ్రీలంక ఇన్నింగ్స్ 10 పరుగుల తేడాతో గెలిచింది. దాంతో కరుణరత్నే కెప్టెన్సీలోని శ్రీలంక రెండు టెస్టుల సిరీస్‌ను 2-0తో సొంతం చేసుకుంది. 1982లో టెస్ట్ హోదా పొందిన శ్రీలంక జట్టుకిది 100వ టెస్టు విజయం కావడం విశేషం. ఓవర్‌నైట్ స్కోరు 54/2తో ఆట చివరిరోజు శుక్రవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఐర్లాండ్ 77.3 ఓవర్లలో 202 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది.

సెమీఫైనల్లో సుమిత్ నగాల్



రోమా గార్డెన్ ఓపెన్ ఏటీపీ చాలెంజర్ టెన్నిస్ టోర్నీలో భారత అగ్రశ్రేణి ప్లేయర్ సుమిత్ నగాల్ వరుసగా మూడో విజయంతో సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. రోమ్‌లో శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో సుమిత్ 7-5, 6-0తో మాక్స్ హూక్స్ (నెదర్లాండ్స్)పై గెలుపొందాడు. 87 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సుమిత్ తన ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశాడు.

సాత్విక్-చిరాగ్ జోడీకి పతకం ఖాయం

సింధు, ప్రణయ్‌లకు నిరాశ



దుబాయ్: ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు ఒక పతకం ఖాయమైంది. పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీ సెమీఫైనల్లోకి దూసుకెళ్లి కనీసం కాంస్య పతకాన్ని ఖరారు చేసుకుంది. క్వార్టర్ ఫైనల్లో సాత్విక్-చిరాగ్ ద్వయం 21-11, 21-12తో అహ్సాన్-హెంద్రా సెతియవాన్ (ఇండోనేసియా) జోడీని ఓడించింది. ఈ గెలుపుతో సాత్విక్-చిరాగ్ 1978 తర్వాత ఆసియా చాంపియన్‌షిప్ పురుషుల డబుల్స్‌లో ఫైనల్ చేరిన, పతకాన్ని ఖరారు చేసుకున్న భారతీయ జోడీగా గుర్తింపు పొందింది. 1978లో ప్రకాశ్ పదుకొనే-సయ్యద్ మోడీ జోడీ భారత్‌కు రజత పతకం అందించింది. మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో భారత స్టార్ పీవీ సింధు 21-18, 5-21, 9-21తో ఆన్ సె యంగ్ (దక్షిణ కొరియా) చేతిలో ఓడిపోయింది. కాంటా సునెయామ (జపాన్)తో జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో హెచ్ఎస్ ప్రణయ్ తొలి గేమ్‌ను 11-21తో కోల్పోయి, రెండో గేమ్‌లో 9-13తో వెనుకబడిన దశలో గాయంతో వైదొలిగాడు. మిక్స్‌డ్ డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో సిక్కి రెడ్డి-రోహన్ కపూర్ (భారత్) జోడీ 18-21, 21-19, 15-21తో దెజాన్-గ్లోరియా విద్‌జాజా (ఇండోనేసియా) జంట చేతిలో ఓడిపోయింది.

రన్నరప్ కార్తీక్ వెంకటరామన్



చెన్నై: సన్‌వే ఫార్మెన్‌టెరా అంతర్జాతీయ చెస్ టోర్నీలో ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ కార్తీక్ వెంకటరామన్ రన్నరప్‌గా నిలిచాడు. స్పెయిన్‌లో ముగిసిన ఈ టోర్నీలో నిర్ణీత 10 రౌండ్ల తర్వాత ఫెదోసీవ్ వ్లాదిమిర్ (రష్యా), కార్తీక్ వెంకటరామన్ (భారత్), ప్రణవ్ (భారత్), లియోన్ ల్యూక్ మెండోకా (భారత్) ఏడు పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచారు. విజేతను నిర్ణయించేందుకు ఈ నలుగురి మధ్య ప్లే ఆఫ్ గేమ్‌లను నిర్వహించారు. వ్లాదిమిర్, కార్తీక్ ఫైనల్ చేరగా.. ఫైనల్లో కార్తీక్‌పై నెగ్గి వ్లాదిమిర్ విజేతగా నిలిచాడు.

లక్నో పరుగుల సునామీ

- మేయర్స్, స్టొయినిస్, బదోని, పూరన్ మెరుపులు
- 56 పరుగులతో పంజాబ్‌పై జయభేరి



'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' స్టొయినిస్

మొహాలీ: వారంకిందట గుజరాత్‌తో జరిగిన మ్యాచ్‌లో చేతిలో బోలెడు వికెట్లున్నా తక్కువ లక్ష్యాన్ని ఛేదించలేకపోయింది లక్నో సూపర్ జెయింట్స్. ఇప్పుడిదే జట్టు పంజాబ్ కింగ్స్‌పై పరుగుల పంజా వేసింది. ఐపీఎల్ చరిత్రలో రెండో అత్యధిక స్కోరు చేసి మరీ 56 పరుగులతో ఘనవిజయం సాధించింది. మొదట లక్నో 20 ఓవర్లలో 5 వికెట్లకు 257 పరుగుల భారీస్కోరు చేసింది. స్టొయినిస్ (40 బంతుల్లో 72; 6 ఫోర్లు, 5 సిక్సర్లు), మేయర్స్ (24 బంతుల్లో 54; 7 ఫోర్లు, 4 సిక్స్‌లు), పూరన్ (19 బంతుల్లో 45; 7 ఫోర్లు, 1 సిక్స్), బదోని (24 బంతుల్లో 43; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) చెలరేగారు. తర్వాత పంజాబ్ 19.5 ఓవర్లలో 201 పరుగులకు ఆలౌటైంది. అథర్వ (36 బంతుల్లో 66; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు.

దంచుడే... దంచుడే...

మేయర్స్ రెండో ఓవర్లో పెట్టిన ధనాధన్ ముహూర్తం తర్వాత వచ్చిన వారంతా దంచేసేలా చేసింది. రాహుల్ (12) నిరాశపరచగా... గుర్నూర్ బ్రార్, అర్ష్‌దీప్, రజా, రబడలు వేసిన పవర్‌ప్లేలో మేయర్స్ 'నాటు నాటు' కొట్టుడుతో 20 బంతుల్లోనే ఫిఫ్టీ సాధించాడు. ఇంకో ఫోర్ కొట్టి జోరుమీదున్న అతన్ని రబడ బోల్తా కొట్టించాడు. కానీ పవర్‌ప్లేలో లక్నో 74/2 స్కోరు చేసింది. ఓపెనర్ల ఆట ముగిసినా... దూకుడైతే ఎంతకీ ఆగలేదు. బదోని, స్టొయినిస్‌ల బ్యాట్లు కూడా భారీ షాట్లపైనే గురి పెట్టడంతో 7.4 ఓవర్లలోనే స్కోరు 100 దాటింది. గుర్నూర్ వేసిన ఆ ఎనిమిదో ఓవర్లో ఇద్దరు చెరో 6, 4లతో 24 పరుగులు పిండారు. ఆటలోనే హైలైట్స్ చూపెట్టడంతో 10 ఓవర్లలో లక్నో 128/2 స్కోరు చేసింది. కాసేపటికి 6 కొట్టిన బదోని మరుసటి బంతికి అవుటైతే... తర్వాత వచ్చిన పూరన్ హ్యాట్రిక్ ఫోర్లు కొట్టాడు. ఇలా ఆకాశమే హద్దుగా సాగిన లక్నో స్కోరు 15.5 ఓవర్లోనే 200 పరుగులు దాటింది. స్టొయినిస్ 31 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తిచేసుకున్నాడు. డెత్ ఓవర్లలో స్టొయినిస్, పూరన్ అవుట్ కావడంతో ఐపీఎల్ చరిత్రలో రెండో అత్యధిక స్కోరు నమోదైంది. లేదంటే స్కోరు చరిత్ర మారేది! 2013లో పుణే జట్టుపై బెంగళూరు 263 పరుగులు చేసింది.

200 పైచిలుకు తీసుకొచ్చినా...

ధావన్ (1), ప్రభ్‌సిమ్రన్ (9) నిరాశపరిచినప్పటికీ అథర్వ, రజా (22 బంతుల్లో 36; 4 ఫోర్లు, 1 సిక్స్) జట్టు స్కోరును 100 దాటించారు. ఆ తర్వాత లివింగ్‌స్టోన్ (23; 2 ఫోర్లు, 1 సిక్స్), జితేశ్ (24; 3 సిక్స్‌లు), స్యామ్ కరన్ (11 బంతుల్లో 21; 2 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా ఆడారు.

స్కోరు వివరాలు

లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్: రాహుల్ (సి) షారుఖ్ (బి) రబడ 12; మేయర్స్ (సి) ధావన్ (బి) రబడ 54; బదోని (సి) చహర్ (బి) లివింగ్‌స్టోన్ 43; స్టొయినిస్ (సి) జితేశ్ (బి) కరన్ 72; పూరన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) అర్ష్‌దీప్ 45; హుడా (నాటౌట్) 11; కృనాల్ (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 257. వికెట్ల పతనం:** 1-41, 2-74, 3-163, 4-239, 5-251. **బౌలింగ్:** గుర్నూర్ 3-0-42-0, అర్ష్‌దీప్ 4-0-54-1, రబడ 4-0-52-2, రజా 1-0-17-0, చహర్ 4-0-29-0, స్యామ్ కరన్ 3-0-38-1, లివింగ్‌స్టోన్ 1-0-19-1.

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ప్రభ్‌సిమ్రన్ (సి) సబ్-సామ్స్ (బి) నవీనుల్ 9; ధావన్ (సి) కృనాల్ (బి) స్టొయినిస్ 1; అథర్వ (సి అండ్ బి) బిష్ణోయ్ 66; రజా (సి) కృనాల్ (బి) యశ్ 36; లివింగ్‌స్టోన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) బిష్ణోయ్ 23; స్యామ్ కరన్ (సి) బదోని (బి) నవీనుల్ 21; జితేశ్ (సి) రాహుల్ (బి) యశ్ 24; షారుఖ్ (సి) బిష్ణోయ్ (బి) యశ్ 6, చహర్ (సి) హుడా (బి) యశ్ 0; రబడ (బి) నవీనుల్ 0; అర్ష్‌దీప్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (19.5 ఓవర్లలో ఆలౌట్) 201. వికెట్ల పతనం:** 1-3, 2-31, 3-109, 4-127, 5-152, 6-178, 7-192, 8-193, 9-197, 10-201. **బౌలింగ్:** స్టొయినిస్ 1.5-0-21-1, మేయర్స్ 1-0-4-0, బదోని 0.1-0-0-0, నవీనుల్ 4-0-30-3, అవేశ్ 2-0-28-0, మిశ్రా 2-0-23-0, బిష్ణోయ్ 4-0-41-2, యశ్ 3.5-0-37-4, కృనాల్ 1-0-13-0.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
రాజస్తాన్	8	5	3	10	0.939
లక్నో	8	5	3	10	0.841
గుజరాత్	7	5	2	10	0.580
చెన్నై	8	5	3	10	0.376
బెంగళూరు	8	4	4	8	-0.139
పంజాబ్	8	4	4	8	-0.510
కోల్‌కతా	8	3	5	6	-0.027
ముంబై	7	3	4	6	-0.620
హైదరాబాద్	7	2	5	4	-0.725
ఢిల్లీ	7	2	5	4	-0.961

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

కోల్‌కతా x గుజరాత్ (మధ్యాహ్నం గం. 3:30 నుంచి)
ఢిల్లీ x హైదరాబాద్ (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

బ్రిజ్‌భూషణ్‌పై 'ఎఫ్ఐఆర్' నమోదు

- సుప్రీంకోర్టు ఆదేశాలతో ఢిల్లీ పోలీసుల చర్య
- కొనసాగుతున్న రెజ్లర్ల నిరసన



"సుప్రీం కోర్టు ఆదేశాలను నేను స్వాగతిస్తున్నా. ఎఫ్ఐఆర్ నమోదు చేయడం నాకూ మంచిదే. విచారణలో వారికి అన్ని విధాలా సహకరిస్తా. విచారణ కమిటీలు ఏర్పాటు చేసినప్పుడు కూడా నేను ప్రశ్నించలేదు. రెజ్లర్లు మరికొంత సమయం ఆగాల్సింది. కానీ వారు కోర్టుకు వెళ్లారు. ఎవరి పట్లా తప్పుగా వ్యవహరించలేదు. నాకు నాపై నమ్మకముంది.
–బ్రిజ్‌భూషణ్ సింగ్

న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌పై రెజ్లర్లు చేసిన లైంగిక వేధింపుల ఆరోపణలకు సంబంధించి ఎట్టకేలకు ఢిల్లీ పోలీసులు స్పందించారు. శుక్రవారం సుప్రీంకోర్టులో వాదనల సందర్భంగా బ్రిజ్‌భూషణ్‌పై 'ఎఫ్ఐఆర్' నమోదు చేస్తామని ఇచ్చిన హామీని పూర్తి చేశారు. బ్రిజ్‌భూషణ్‌పై కన్నాట్ ప్లేస్ పోలీస్ స్టేషన్‌లో రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. మైనర్ రెజ్లర్ చేసిన ఆరోపణలను పరిగణనలోకి తీసుకుంటూ 'పోక్సో యాక్ట్' ప్రకారం ఒక ఎఫ్ఐఆర్... ఇతర రెజ్లర్లు చేసిన ఫిర్యాదుల ప్రకారం మరో ఎఫ్ఐఆర్‌ను నమోదు చేశారు. రెండింటిపై సత్వర విచారణ చేపడతామని పోలీసులు చెప్పారు. ఈ అంశంపై మే 5న మరోసారి విచారిస్తామని, ఆలోగా అఫిడవిట్ దాఖలు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. నిరసన చేస్తున్న రెజ్లర్లు, ఫిర్యాదు చేసిన వారి జాబితాలో ఉన్న ఒక మైనర్ రెజ్లర్ భద్రతకు సంబంధించి కూడా ఢిల్లీ పోలీసులు బాధ్యత తీసుకోవాలని కూడా సుప్రీం సూచించింది. 'మైనర్ రెజ్లర్‌కు ఉన్న ముప్పును దృష్టిలో పెట్టుకుంటూ తగినంత భద్రత కల్పించాలని ఢిల్లీ పోలీస్ కమిషనర్‌ను ఆదేశిస్తున్నాం. ఇతర రెజ్లర భద్రతను కూడా ఆయన సమీక్షించాలి. దర్యాప్తునకు సంబంధించిన డాక్యుమెంట్ల విషయంపై గోప్యత కూడా పాటించాలి' అని చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహలతో కూడా బెంచీ ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు బజరంగ్, వినేశ్, సాక్షి తదితర రెజ్లర్లు జంతర్‌మంతర్ వద్ద తమ నిరసన కొనసాగిస్తున్నారు. బ్రిజ్‌భూషణ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఢిల్లీ పోలీసులు నిర్ణయించడం పట్ల రెజ్లర్లు సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే ఎఫ్ఐఆర్ మాత్రమే కాదు, బ్రిజ్‌భూషణ్ అరెస్ట్ అయ్యే వరకు ఇది కొనసాగుతుందని బజరంగ్ స్పష్టం చేశాడు. 'విజయం దిశగా ఇది మొదటి అడుగు మాత్రమే. అయితే మా నిరసన ఇకపైనా కొనసాగుతుంది. ఆయనను అన్ని పదవుల నుంచి తప్పించడంతో పాటు జైలుకు పంపాల్సిందే. లేదంటే విచారణను ప్రభావితం చేస్తాడు' అని రెజ్లర్ సాక్షి మలిక్ పేర్కొంది.



వినేశ్ ఫొగాట్, సంగీత ఫొగాట్, సాక్షి

'కరెంట్ కట్'



'ఢిల్లీ పోలీసులు మా పట్ల దుర్మార్గంగా ప్రవర్తిస్తున్నారు. ఎఫ్ఐఆర్ నమోదైంది కాబట్టి నిరసన ముగించమని ఒత్తిడి తెస్తున్నారు. కరెంట్ కట్ చేసి గేట్లు మూసేశారు. భోజనం, నీళ్లు కూడా లోపలికి రానివ్వడం లేదు. నేను ఏసీపీతో మాట్లాడాను. ఏం చేస్తారో చేసుకోండి అని ఆయన జవాబిచ్చాడు. వారు ఏం చేసినా మా ఆందోళన కొనసాగిస్తాం. మీ ఇంటి ఆడపిల్లలైతే ఇలాగే చేస్తారా. బ్రిజ్‌భూషణ్ చట్టంకంటే పెద్దవాడిగా మారిపోయాడు' (అర్ధరాత్రి 12 గంటలకు పరిస్థితి).

సిసింద్రీలకు సమ్మర్ కేర్!





ఎండలు మండిపోతున్నాయి. ఇప్పుడే వేసవి సెలవులు మొదలయ్యాయి. ఇక పిల్లల ఆటలు, పాటలు అంటూ ఎక్కువ సేపు బయటే తిరుగుతూ ఉంటారు. తిండీ, నిద్రనూ కూడా నిర్లక్ష్యం చేసి మరీ ఆటల్లో మునిగిపోతారు. సమ్మర్‌లో చిన్నపిల్లలను నిర్లక్ష్యం చేస్తే త్వరగా డీహైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదం ఉంది. చిన్నపిల్లల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోకపోతే వడదెబ్బ, చర్మ సమస్యలతో సహా మరెన్నో అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉంది. అందుకే వాళ్లను ఈ కాలంలో మరింత జాగ్రత్తగా చూసుకోవాలి.

మధ్యాన్నం పూట బయటకు పంప వద్దు

వేసవిలో పిల్లలు ఎక్కువగా ఆటలు ఆడుకోవడానికి.. బయటకు వెళ్లిపోతారు. అయితే మధ్యాహ్న సమయం లో మాత్రం పిల్లలను బయటకు అనుమతించవద్దు. ఆ సమయంలో ఎండ ఎక్కువగా ఉంటుంది, రేడియేషన్ కూడా ఎక్కువగా ఉంటుంది. బయట వాతావరణం చాలా వేడిగా ఉండడం వల్ల పిల్లల శరీర ఉష్ణోగ్రత పెరిగి.. చెమట ఎక్కువగా పడుతుంది. ఒంట్లో నీరు వేగంగా ఆవిరై... డీహైడ్రేషన్‌కు గురవుతారు. ఇవి వడదెబ్బకు దారితీస్తాయి. ఉదయం, సాయంత్రం ఎండలేని సమయాల్లోనే పిల్లలను బయటకు అనుమతించాలి.

ఏం చేయాలి మరి?

మధ్యాహ్న సమయంలో పిల్లలకి కథలు చెప్తూ, పుస్తకాలు చదివిస్తూ, బొమ్మలు వేయిస్తూ, ఇంట్లో ఆడుకునే ఆటలు ఆడుకునేలా చూడాలి. పజిల్స్ ఇవ్వడం, అంత్యాక్షరి, వర్డ్ బిల్డింగ్ వంటివి ఆడించాలి. వారికి ఆసక్తి ఉన్న అంశంపై మరింత ఎక్కువ ఏకాగ్రత చూపేలా లేదా రాని సబ్జెక్టును నేర్చుకునేలా చేయాలి.

సౌకర్యంగా ఉండే దుస్తులు

బయటి వాతావరణం వేడిగా ఉన్నప్పుడు చిన్నారులకు తేలికైన, కాటన్ వస్త్రాలను వేయాలి. ఇవి సింథటిక్, ఇతర ఫ్యాబ్రిక్స్ కంటే చెమటను ఎక్కువగా పీల్చేసుకుంటాయి కాబట్టి బేషజాలకు పోకుండా పిల్లలకు లేత రంగులలో ఉండే కాటన్ దుస్తులను వేయడం ఉత్తమం. అలాగే రెండుపూటలా స్నానం చేయించడం మంచిది. బయట ఆటలాడి వచ్చినా, ఇంట్లోనే ఉన్నా కూడా పిల్లలకు చెమట పడుతుంది. అలాగే వదిలేస్తే అలర్జీలు వస్తాయి. అందువల్ల గోరువెచ్చటి నీటితో రెండుపూటలా స్నానం చేయించాలి.

మసాలాలు, జంక్ ఫుడ్ జోలికి వెళ్లవద్దు..

వేసవిలో కారం, మసాలా, వేపుళ్లు, స్వీట్లు వంటి వాటికి దూరంగా ఉంచాలి. కారం, మసాలాలు తింటే మరింత వేడి చేసే ప్రమాదం ఉంది. పిజ్జా, బర్గర్, అలాగే నిల్వ ఆహారాన్ని ఇవ్వకూడదు. ఇవన్నీ దాహాన్ని మరింత పెంచుతాయి. ఎక్కువగా ఇంట్లో తాజాగా వండిన ఆహారాన్నే తీసుకునేలా చూడాలి. అలాగే లేస్, కుర్కురేలు వంటివి అసలు మంచిది కాదు. వీలయినంత వరకు ఇంట్లో వండిన చిరుతిళ్లే అలవాటు చేయాలి.

పండంటి ఆరోగ్యం కోసం..

సాధారణంగా వేసవిలో పిల్లల చర్మం పొడిబారి, దురద, మంట వంటి పలురకాల ఎలర్జీలు మొదలవుతుంటాయి. అటువంటి లక్షణాలు కనిపించినప్పుడు వారు డీహైడ్రేషన్‌కు గురైనట్లు గుర్తించాలి. యూరిన్‌కు అతి తక్కువగా వెళ్లడం, కడుపునొప్పి, తలనొప్పి, వికారంగా ఉన్నా.. జాగ్రత్తగా గమనించాలి. మామిడి, ద్రాక్ష, పైనాపిల్, పుచ్చ, కమలాజ్యూస్‌లు పట్టించాలి. రోజూ ఉదయం గ్లాసు కొబ్బరినీళ్లు ఇవ్వాలి. ఇందులోని పొటాషియం వడదెబ్బ తగలకుండా కాపాడుతుంది. పిల్లలతో రోజుకి కనీసం రెండు లీటర్ల నీటిని తాగించడం అన్నింటికన్నా ముఖ్యం. సబ్జానీళ్లు ఇస్తే మరీ మంచిది.

చల్లటి పదార్థాలు ఇవ్వద్దు

వేసవిలో తాపం ఎక్కువగా ఉండటం సహజం. చల్లటివి ఏమైనా తినాలని, తాగాలనీ అనిపిస్తుంది. అలాగని ఫ్రిజ్‌లో పెట్టి.. తీసిన వెంటనే తిన్నా అవి ఆరోగ్యానికి హాని కలిగిస్తాయి. పిల్లలు ఫ్రిజ్ నీళ్లు తాగితే.. జలుబు చేసే అవకాశం ఉంది. దానికన్నా కుండ నీళ్లు తాగించడం చాలా మంచిది.

మజ్జిగ ఇవ్వండి

మధ్యాహ్నం భోజనం తర్వాత పలుచటి మజ్జిగలో చిటికెడు జీలకర్ర పొడి, ఉప్పు, పావుచెక్క నిమ్మరసం కలిపి తాగిస్తే జీర్ణశక్తి మెరుగ్గా ఉంటుంది. మజ్జిగలో కాల్షియం, విటమిన్ బి 12, పొటాషియం అందుతాయి. ఇవి తలనొప్పి, వికారం వంటి సమస్యల నుంచి ఉపశమనాన్ని స్తాయి. క్యారెట్, కీర దోస ముక్కలపై కాస్త నిమ్మ రసం, చిటికెడు ఉప్పు చల్లి తినిపించడం మంచిది. ముఖ్యంగా డీ హైడ్రేషన్‌కు గురి కాకుండా చూసుకోవాలి.

సన్‌స్క్రీన్

మీ పిల్లలు బయటకు వెళ్లేప్పుడు.. అతిగా ఎక్స్‌పోజ్ అయ్యే భాగాలకు సన్‌స్క్రీన్ లోషన్ రాయడం మంచిది. సన్‌స్క్రీన్ పిల్లలను వడదెబ్బ, రాషెస్ నుంచి రక్షిస్తుంది. మీ పిల్లలు బయట ఉండే సమయం బట్టి.. సన్‌స్క్రీన్ రెండు సార్లు రాసినా పర్వాలేదు.

వేసవి ఫ్లూ

5 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు ఏడాది పొడవునా ఈ సమస్యలు తరచుగా వస్తాయి. కాబట్టి వారిని ఎండలో తిరగనీయకుండా ఉంచాలి. సాయంత్రం వేళ లేదా ఉదయం పూట వాతావరణం చల్లగా ఉన్నప్పుడు ఆడుకోవడానికి అనుమతివ్వండి. వారికి సరైన పౌష్టికాహారం ఇవ్వడం ద్వారా రోగనిరోధక శక్తిని పెంచవచ్చు.

కీటకాల బెడద

ఎండాకాలంలో దోమలు చిరాకు పుట్టిస్తాయి. దోమలే కాకుండా ఇతర కీటకాల కాటుకు పిల్లలు గురయ్యే అవకాశం ఉంది. ప్రభావిత ప్రాంతంలో దురద, వాపు వస్తాయి కాబట్టి వైద్యుల సూచన మేరకు పిల్లల కోసం ప్రత్యేకమైన దోమల నివారణ మందులను వాడేందుకు ప్రయత్నించండి.

ఈతకు వెళుతుంటే...

చెరువులు.. బావులకు సరదాగా ఈతకు వెళ్లే పిల్లల విషయంలో తల్లిదండ్రులు మరింత జాగ్రత్తగా ఉండాలి. కొంత మంది పాత బావుల్లో కూడ ఈతకు వెళతారు. ఇలాంటి సమయంలో కొన్ని ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంటుంది. తల్లిదండ్రులు పిల్లలు ఈత కొట్టే ముందు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లలు రోజంతా బయట ఆడుకుంటారు, ఈ సమయంలో వారు తినడం, తాగడం మర్చిపోతారు. అటువంటి పరిస్థితిలో, వారి ఆహారంపై మరింత శ్రద్ధ వహించడం మంచిది.

కూలింగ్ గ్లాసెస్

మీ పిల్లలు ఎండల్లో బయటకు వచ్చినప్పుడల్లా.. కూలింగ్ గ్లాసెస్ పెట్టుకునేలా చూడండి. కూలింగ్ గ్లాసెస్ పెట్టుకుంటే.. సూర్యుని కిరణాలు డైరెక్ట్‌గా కళ్లల్లో పడవు. కళ్లు సేఫ్‌గా ఉంటాయి. కుదిరితే.. క్యాప్ పెట్టుకుంటే ఇంకా మంచిది.. ఎండ డైరెక్ట్‌గా వారి తల మీద పడదు. ఎండ తలమీద పడితే.. తలనొప్పి, వినుగు, కళ్లు తిరిగే అవకాశం ఉంటుంది. బయట నుంచి ఇంటికి వచ్చిన తర్వాత చల్లటి నీళ్లతో కళ్లు శుభ్రంగా కుడిగితే.. వారికి ప్రశాంతంగా ఉంటుంది.

మామిడిపళ్లు తినేముందు...



మామిడి పండ్లను తినేముందు వాటిని కనీసం ఒక గంట పాటు నీటిలో నానబెట్టాలని అమ్మమ్మలు, నానమ్మలు సలహా ఇస్తూ ఉంటారు. కారణం ఏమిటంటే, మామిడిపండ్లలో ఫైటిక్ ఆమ్లం ఉత్పత్తి అవుతుంటుంది. ఇలా అధికంగా ఉత్పత్తి అయ్యే ఈ యాసిడ్‌ను తొలగించడానికి నీళ్లలో నానబెట్టాలి. వివిధ కూరగాయలు, ధాన్యాలు, పప్పులు వంటి వాటిలో ఈ ఫైటిక్ యాసిడ్ ఉంటుంది. ఇలా నానబెట్టడం వల్ల అది విచ్ఛిన్నమైపోతుంది. ఈ ఫైటిక్ యాసిడ్ అదనపు వేడిని కూడా ఉత్పత్తి చేస్తుంది. నీటిలో నానడం వల్ల ఈ అదనపు వేడి తగ్గిపోతుంది.

టాక్సిన్లను తొలగిస్తుంది

మామిడి పండ్లను తినడానికి ముందు గంటపాటు నీళ్లలో నానబెట్టడం వల్ల వాటి తొక్కపై ఉండే కనిపించని నూనె తొలగిపోతుంది. అది కొందరిలో ఎలర్జీలు కలిగించే అవకాశం ఉంది. అలాగే పాలీఫెనాల్స్, టానిన్లు వంటి సూక్ష్మ పదార్థాల మిశ్రమం తొక్క పైన ఉండే అవకాశం ఉంది. అవి శరీరంలో చేరితే దురద, బొబ్బలు రావడానికి కారణం అవుతుంది. మామిడిపండ్లు నానబెట్టడం వల్ల అవన్నీ తొలగి పండు తినడానికి అనువుగా సురక్షితం గా మారుతుంది.

మామిడి పండ్లను ఇలా నీటిలో నానబెట్టడం వల్ల వాటి రుచి కూడా బాగుంటుంది. ప్రత్యేకించి ఆ పండ్లను ఫ్రిడ్జ్‌లో ఉంచినట్లయితే వాటిని కచ్చితంగా నీళ్ళల్లో నానబెట్టాలి. ఎందుకంటే ఫ్రిజ్‌లో పెట్టడం వల్ల ఆ పండులో ఉండే కొన్ని సమ్మేళనాలు పండు వాసనను, రుచిని మార్చేస్తాయి. నీళ్లలో నానబెట్టడం వల్ల వాటి సహజమైన తీపి, సువాసనను తిరిగి పొందవచ్చు.

నులి పురుగుల నివారణకు...



పిల్లలు కొన్నిసార్లు ఎంత రుచిగా చేసి పెట్టినా సరే, ఆకలి కావడం లేదంటారు. తరచూ విరేచనాలు చేసుకుంటారు. బరువు తగ్గిపోయి బలహీనంగా కనిపిస్తుంటారు. ఎందుకు ఇలా అవుతోందో తెలియక తల్లిదండ్రులు ఆందోళన చెందుతారు. నిజానికి ఇది ప్రమాదకరమైన వ్యాధి లక్షణాలేమీ కాదు. కడుపులో నులిపురుగులు ఉండటం వల్ల ఇలాంటి సమస్యలు వస్తాయి. వాటిని ఎలా నివారించాలో తెలుసుకుందాం...

తినే ఆహారం పేగుల్లోకి చేరినప్పుడు రక్తంలోకి చేరాల్సిన పోషకాలను నులిపురుగులే పీల్చుకోవడంతో చిన్నారుల్లో ఎదుగుదల నిలిచిపోయి రోగాల బారిన పడుతారు. ఆకలి మందగించి ఒక్కోసారి ప్రాణాల మీదికి కూడా వస్తుంది.

కడుపులో నులి పురుగులు పోవడానికి...

- వేప నూనె పది చుక్కలు చక్కెరలోవేసి లోపలకు తీసుకుంటే క్రిములు నశిస్తాయి
- గుప్పెడు లేత వేప చిగురు, అర చెంచా ఉప్పు, అర చెంచా పసుపు కలిపి మాత్రల్లా చేసుకొని రాత్రి నిద్రించే ముందు ఒక మాత్ర వేసుకుంటే నులిపురుగులు నశిస్తాయి.
- పచ్చి బొప్పాయి కాయకు గాట్లు పెట్టగా వచ్చిన పాలు చెంచా, ఆముదం చెంచా కలిపి తాగితే. పురుగులు పడిపోతాయి.
- ఎండించిన వేప పువ్వు 50 గ్రాములు. మిరియాల పొడి చెంచా, ఉప్పు చెంచా కలిపి ప్రతిరోజు భోజనంలో మొదటి ముద్దగా కలుపుకుని తినాలి, లేదా గ్లాసు నీటిలో ఒక చెంచా వేసి సగం అయ్యే వరకు మరిగించి కషాయం లాగా తాగినా కూడా నులిపురుగులు నశిస్తాయి.
- వీటన్నింటినీ చేయడం కష్టం అనుకుంటే ఆల్బెండిజాల్ ట్యాబ్లెట్‌ను పదిహేను రోజులకొకసారి చొప్పున నెలరోజులు వాడాలి. ఒక నెల గ్యాప్ ఇచ్చి అదే రిపీట్ చేయాలి.